ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 29 | మార్చి | 2024
పేజీలు 7

## ఏప్రిల్ ఒకటి లోగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



కలెక్టర్ వివి గౌతమ్

2లో

# కాంగ్రెస్‌ది జాప్యం.. బిఆర్ఎస్‌ది ప్రచార శూన్యం..!


- అభ్యర్థిని ప్రకటించని కాంగ్రెస్
- ప్రచార జాడలేని కారు పార్టీ
- కార్యకర్తల్లో నైరాశ్యం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిని ప్రకటించ కుండా జాప్యం చేస్తుండగా, అభ్యర్థిని ప్రకటించినా బిఆర్ ఎస్ కార్య రంగంలోకి రాలేదు. అభ్యర్థిని ప్రకటించిన తర్వాత కూడా సోషల్ మీడియాలో పుకార్లు షికార్లు చేస్తు న్నాయి. బిజెపి కార్యకర్తల్లో ఆయన అయితే బాగుండేది ఇయనకు ఇచ్చారన్న భావన వ్యక్తమవుతుంది. మొత్తంగా ప్రధాన పార్టీల కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి ఎంపిక చిక్కుముడి పడిన నేపథ్యంలో మళ్లీ కాంగ్రెస్ అగ్ర నేతల్లో ఒకరైన ప్రియాంక గాంధీ పేరు తెరపైకి తెచ్చారు. ఎవరిని అడ్డుకునేందుకో లేక ఎవరి మెప్పు కోసమో కానీ మరుగునపడిన ప్రియాంక గాంధీ పేరు తెర మీదకు వచ్చింది. ముగ్గురు మంత్రుల కుటుంబ సభ్యులు పోటీ పడుతుండటం, వీరితో పాటు టికెట్ రేసులో పారిశ్రామిక వేత్తలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండ డంతో అభ్యర్థి ఎంపిక అధిష్టానానికి ఇబ్బందిగా మారింది. తప్పనిసరిగా కాంగ్రెస్‌దే విజయమన్న ఖమ్మం స్థానం అభ్యర్థి ఎంపిక జాప్యం కార్యకర్తల్లో నైరాశ్యానికి గురి చేస్తుంది.

**కదలని కారు...**

భారత రాష్ట్ర సమితి తొలి దశలోనే ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపి నామ నాగేశ్వరరావును ప్రకటిం చినా ప్రచారం ఎక్కడ ప్రారంభించ లేదు. నామ ఇంట్లో వివాహ కార్యక్రమం ముగిసి పది రోజులు కావస్తున్నా ఆయన ఖమ్మంకు రాలేదు. ఓటమి తర్వాత నైరాశ్యంలో ఉన్న పార్టీకి నామ వైఖరి మరింత నైరాశ్యాన్ని తెచ్చిపె ట్టింది. అభ్యర్థిగా ఎంపికైన తర్వాత జరిగిన సమావేశానికి కార్యకర్తలు భారీగా తరలి వచ్చి జోష్ నింపిన ఆ జోష్‌ను

మిగతా 2లో..



## వైద్య ఆరోగ్య శాఖలో నిలిచిన
# అత్యవసర డిప్యుటేషన్లు..!




- డిప్యుటేషన్ల జాబితాపై కలెక్టర్ ఆరా
- గత, ప్రస్తుత లిస్టున్ క్రాస్ చెక్
- వైద్య ఆరోగ్యశాఖ నుండి వివరాలు అడిగిన కలెక్టర్
- నిరాశ చెందుతున్న దళారులు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** "వైద్య ఆరోగ్యశాఖలో మళ్లీ డిప్యుటేషన్ల దందా ! " అంటూ ఈ నెల 23న "ప్రజాపక్షం" దిన పత్రికలో ప్రచురితమైన కథానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. అత్యవసరాల పేరిట డిప్యుటేషన్ల కోసం చేసుకున్న దరఖాస్తులను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దీంతో ఆశా వాహుల్లో నిరాశ ఎదురైంది. వైద్య ఆరోగ్యశాఖలో డిప్యుటేష న్లను రద్దు చేస్తూ గత నెల 7న ఆ శాఖ

మిగతా 2లో..

## సూత్రధారులను వదిలి..
# చిరుద్యోగిపై వేటు..!




- రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్ బదిలీ
- సూత్రధారులు, పాత్రధారులపై చర్యలెప్పుడో...?

**ప్రజాపక్షం/ వైరా :** ఆరోపణలు వచ్చాయి కాబట్టి ఏదో ఒకటి చేసి చేతులు దులుపుకుందామన్నట్లు ఉంది అధికా రుల వైఖరి. వార్తలు వచ్చాయి, అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభ్యమయ్యాయి. ఎవరి మీదో ఒకరి మీద వేటు వేసి తప్పించుకుందామన్న భావన కలిగి నట్లు ఉంది అధికార యంత్రాంగానికి, అందుకే చిరుద్యో గిపై బదిలీ వేటు వేశారు. అక్రమ రిజిస్ట్రేషన్లకు కారణ మైన వారి పైనా, ఇందుకు సహకరించిన వారి పైనా ఎటు వంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

మిగతా 2లో..

# కాంగ్రెస్‌ది జాప్యం.. బిఆర్ఎస్‌ది ప్రచార శూన్యం..!

(మొదటిపేజీ తరువాయి)
అందిపుచ్చుకోవడంలో నామ పూర్తిగా వైఫల్యం చెందారు అన్నింటికి మించి బిఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్న నామ పార్టీ మారతాడని విస్తృత ప్రచారం జరుగుతున్న ఆయన కానీ, ఆ పార్టీ కానీ ఖండించకపోవడం అనుమానాలకు తావిస్తుంది. ఆ పార్టీకి సంబంధించి ఎంపి రవిచంద్ర తప్ప మిగిలిన వారు అందుబాటులో లేరు. సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లిలో జరిగిన కార్యక్రమాలకు హాజరవుతున్నారు. జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ కూడా ఎందుకో అంతగా స్పందించడం లేదు. నామ నాగేశ్వరరావు పార్టీ మారతారన్న అనుమానం పార్టీ నాయకత్వంలో కూడా ఉందా...? అందుకే ఆయనను అభ్యర్థిగా చూపుతూ కార్యక్రమాలను నిర్వహించడం లేదా అన్న అనుమానం పార్టీ క్యాడర్ మదిని తొలుస్తుంది. కారు ప్రచారమే శూన్యమైంది. ఎక్కడ ఎప్పుడు ఏ నాయకుడు గొంతు విప్పిన పరిస్థితి లేదు. అవకాశం దొరికితే కాంగ్రెస్‌లో చేరాలన్న యావ తప్ప మరొకటి బిఆర్ఎస్ నేతల్లో కనిపించడం లేదు. ఒకసారి ఓటమి చెందిన తర్వాత బిఆర్ఎస్ పరిస్థితి ఎలా ఉందంటే రంకేలు వేసి తొడగొట్టిన వాళ్లంతా మాటుమయమయ్యారు. అధికారం కోసం కంతలు వెతుకులాడుకుంటున్నారు తప్ప ప్రజల ముందుకు రావడం లేదు. ఉద్యమ పార్టీలో పోరాట జావ చచ్చిపోయింది. బిఆర్ఎస్ పరిస్థితి ఈవిధంగా ఉంటే బిజెపిలో ఎవరికో టికెట్ దక్కుతుందనుకుంటే మరెవరికో దక్కింది. ఆ పార్టీ లీడర్లు, క్యాడర్లు కక్కలేక మింగలేక సతమతమవుతున్నారు. ఏమన్న మాట్లాడదామనుకుంటే సోకాల్డ్ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని లోలోన కుమిలిపోతున్నారు. పార్లమెంటు ఎన్నికల ముంగిట క్యాడర్‌లో నైరాశ్యం ఏ ఫలితాన్ని ఇస్తుందో వేచి చూడాలి.

## సూత్రధారులను వదిలి..
# చిరుద్యోగిపై వేటు..!

**(మొదటిపేజీ తరువాయి)** వైరా రిజిస్ట్రార్ కార్యాలయంలో 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమ పద్ధతుల్లో పలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. తగిన ఆధారాలతో ఈ విషయమై ప్రజాపక్షం వరుస కథనాలను ప్రచురించింది. ఎట్టకేలకు కదిలిన అధికార యంత్రాంగం బుధవారం రిజిస్ట్రార్ కార్యాలయంలోని పలు ఫైళ్లను పరిశీలించారు. గురువారం ఇక్కడ అటెండర్‌గా పనిచేస్తున్న దుస్సా కృష్ణను భద్రాచలంకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో జాని అనే వ్యక్తిని నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కోట్ల రూపాయలు చేతులు మారినా ఈ అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అసలు వ్యక్తులపైన ఏం చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశమైంది. అటెండర్ బదిలీతో సరిపెడతారా లేక మొత్తం వ్యవహారం పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించిన వ్యక్తులు, అధికారులపై చర్యలు తీసుకుంటారా అన్నది తేలాల్సి ఉంది. ఇది ఇలా ఉండగా వైరా రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆందోళనను నిర్వహించింది. ఇదిలా ఉండగా అటెండర్‌గా పనిచేస్తున్న దుస్సా కృష్ణ అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి వచ్చిన వ్యక్తులతో సంప్రదించి బేరం కుదిరిన తర్వాత అధికారులకు పని అప్పగించే వాడని అతనిపై ఆరోపణలు వినవస్తున్నాయి.

## వైద్య ఆరోగ్య శాఖలో నిలిచిన
# అత్యవసర డిప్యూటేషన్లు..!

(మొదటిపేజీ తరువాయి)
కార్యదర్శి క్రిష్టిన జడ్ ఛోంగ్తో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎవరి స్థానాలకు వారు వెళ్లి విధుల్లో చేరారు. కాగా ఆ ఉత్తర్వుల్లో అత్యవసరమైతే కలెక్టర్ల ఆమోదంతో డిఎంహెచ్ఓలు డిప్యూటేషన్లు ఇవ్వొచ్చు అంటూ పేర్కొన్నారు. ఇక్కడే ఇప్పుడు అసలు కథ మొదలైంది. ఉత్తర్వుల ప్రకారం రిలీవ్ అయిన 85 మందిలో సుమారు 40 మందికి పైగా వెంటనే పలు రకాల సాకులతో మళ్లీ అత్యవసరం అంటూ దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఫైల్ కలెక్టర్ వద్దకు చేరింది. అయితే ఈ లోగా ప్రజాపక్షంలో కథనం రావడంతో కలెక్టర్ ఆలోచనలో పడి తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

**కలెక్టర్ ఆరా...**

అత్యవసరం పేరిట కలెక్టర్‌కు చేరిన జాబితాపై ఆరా తీస్తున్నారు. గతంలో రిలీవ్ అయిన వారు ఎవరెవరూ, ఎక్కడెక్కడి నుండి ఎక్కడెక్కడ విధులు నిర్వహించారు. వారి రిలీవ్ అయి ఎంత కాలం అయ్యింది. తిరిగి అత్యవసర డిప్యూటేషన్ కోసం దరఖాస్తులు చేసుకుంది ఎంత మంది. వారిలో ప్రస్తుతం రిలీవైన వారు ఎందరున్నారు అనే దానిపై కలెక్టర్ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రిలీవ్ లిస్టుతో పాటు ప్రస్తుత దరఖాస్తు లిస్టును క్రాస్ చెక్ చేయాలని సంబంధిత శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో వారం రోజుల్లోగా నివేదిక రూపంలో సమర్పించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించినట్లు సమాచారం.

**దళారుల్లో నిరాశ ...**

వైద్య ఆరోగ్యశాఖలో అత్యవకర డిప్యూటేషన్లను కలెక్టర్ తాత్కాలికంగా నిలుపుదల చేయడంతో దళారుల గొంతులో వెలగపండు పడినట్లు అయ్యింది. కోరుకున్న చోటికి డిప్యూటేషన్ చేయిస్తామని, అధికారులు మాకు బాగా తెలుసునని నమ్మబలికి ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్క రేటు కట్టి వసూళ్లు చేసినట్లు తెలిసింది. ఇప్పుడు డిప్యూటేషన్ల ప్రక్రియ నిలుపుదల కావడంతో వారు అయోమయ స్థితిలో పడ్డారు. డబ్బులు ఇచ్చిన వారు తమ సొమ్ముల్లు వెనక్కు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా, ఇంకా కొందరితో ఒప్పందాలు అయ్యాయని, నోటికాడి కూడా పోయిందని దళారులు నిరాశ చెందుతున్నట్లు తెలుస్తోంది.


వైద్య ఆరోగ్య శాఖలో
మళ్లీ డిప్యూటేషన్ల దందా..!
- గత నెల్లో రద్దు చేసిన ప్రభుత్వం
- తప్పని సరైతే జిల్లా స్థాయిలో డిప్యూటేషన్‌కు అవకాశం
- దీనిని అలుసుగా చేసుకుని అక్రమాలకు తెర
- డిఎంహెచ్‌ఓ కార్యాలయం చుట్టూ ప్రదిక్షణలు
- కలెక్టర్ వద్ద జిల్లా స్థాయి జాబితా
- ఒక్కో పోస్టుకు ఒక్కో ధర

ఒక చిన్న ... మాలకు తెరతీసింది. డిప్యూటేషన్లు రద్దు చేస్తూ గత నెల్లో ప్రభుత్వం ఇచ్చిన జీ... డిప్యూటేషన్లు అనుమతించవచ్చు అని పేర్కొనడంతో కొందరు అత్యవసరం అనే సాకును చూపి జిల్లా... ందుకు డిఎంహెచ్‌ఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ వ్యవహారం దళారులకు కాసులు కురిపిస్తోంది. ఇప్పటికే సుమారు 40 మందికి పైగా అత్యవసర పరిస్థితిని కోరుతూ డిప్యూటేషన్‌లకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ జాబితా కలెక్టర్ ఛాంబర్‌కు చేరింది.
-ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

## ఏప్రిల్ ఒకటి లోగా
# కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ ఒకటి లోగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. గురువారం నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో రబీ ధాన్యం సేకరణ, కార్యచరణ పై జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 151 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇట్టి కేంద్రాలు ఏప్రిల్ ఒకటి నుండి అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. జిల్లాలో రబీలో 171357 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు రానున్నట్లు అంచనా ఉందన్నారు. ఐకెపి ద్వారా 28, పిఏసిఎస్ ల ద్వారా 96, డిసిఎంఎస్ లద్వారా 27 ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గన్నీ బ్యాగులు, తూకం, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు కేంద్రాలకు అందజేయాలన్నారు. కేంద్రాల బాధ్యులకు శిక్షణ నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతున్న కేంద్రాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సెక్టార్ల వారీగా ధాన్యం రవాణాకు ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లను సిద్ధం చేయాలన్నారు. మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు సంబంధిత వారితో సమావేశాలు చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎఫ్ఏక్యూ ప్రకారం తేమ శాతం ఉండేలా తాలు లేకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి కనీస మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీం, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, డిఆర్‌డివో సన్యాసయ్య, ఆర్టివో అఫ్రిన్, డిఎం మార్క్‌ఫెడ్ సునీత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతకు తిలోదకాలు
-పట్టించుకోని అధికార యంత్రాంగం



**ప్రజాపక్షం/ బోనకల్ :** అధికార యంత్రాంగం అండతో గుత్తేదారులు నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడక పోవడంతో గుత్తేదారులకు వరంగా మారింది. వారు నిర్మించిందే భవనం చేసిందే పని అన్న విధంగా తయారైంది. బోనకల్ మండల కేంద్రంలో సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహానికి సంబంధించి 2023 సంవత్సరంలో రూ. 70 లక్షలు అదనపు గదుల నిర్మాణం కోసం మంజూరయ్యాయి. 2013లో అప్పటి ప్రభుత్వం మూడు కోట్ల వ్యయంతో ఇక్కడ బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. ఇప్పుడు అదనపు గదులు నిర్మిస్తున్న గుత్తేదారు ఇష్టానుసారంగా నిర్మాణం జరుపుతున్నారు. కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. మండల అధికారుల కార్యాలయాలకు అత్యంత సమీపంలో ఈ నిర్మాణం జరుగుతున్నా ఎవరు పట్టించుకోకపోవడం గమనార్హం. నాణ్యతా ప్రమాణాలు లేకుండా జరుగుతున్న భవన నిర్మాణానికి సంబంధించి అధికారులకు పలుమార్లు విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు విన్నవించినా స్పందించక

# పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



**జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఎఎల్ఎంటి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 ని వినియోగించుకోవాలన్నారు. ఇందుకు గాను సిఈవో కార్యాలయపు వెబ్‌సైట్‌లో ఉన్న పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన వివరాలను ఎన్ఐసి ద్వారా పొందుపరిచి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో ప్రతి జిల్లా అధికారి తమ కార్యాలయ సిబ్బందితో సహా తమ వివరాలను పొందుపరిచే బాధ్యత కార్యాలయ అధికారి, నోడల్ అధికారిదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. మే ఆరు వరకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు తీసుకుంటామన్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి ఈ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, సర్వీసు ఓటర్లకు ఫారం 12 అందించి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటరు పెసిలిటేషన్ సెంటర్‌లో ఓటింగ్ చేసే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే ఇతర జిల్లా, ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఓటర్లను గుర్తించడం వారికి ఫారం 12 అందించి జిల్లాలో అత్యధికంగా ఓటింగ్ శాతం పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, యువరాజు, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఖమ్మం, కొత్తగూడెం ఆర్డివోలు గణేష్, మధు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర మహాసభలు

**-హాజరుకానున్న సిఎం, పలువురు రాష్ట్ర మంత్రులు**
**-రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** టియుడబ్ల్యూజె (ఐజెయు) మూడవ తెలంగాణ రాష్ట్ర మహాసభలు మే నెల చివరి వారంలో ఖమ్మంలో జరగనున్నట్లు టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, వివిధ వర్గాల ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర మహాసభల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక సమావేశం గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ మహాసభల నిర్వహణకు సంబంధించి ఖమ్మంజిల్లాకు అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మహాసభలు నిర్వహించడం ఖమ్మంలో ఇది మూడోసారి అని గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రెండు సార్లు మహాసభలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మహాసభల నిర్వహణను పురస్కరించుకుని ఏప్రిల్ మొదటి వారంలో సన్నాహాక సమావేశం నిర్వహించనున్నామని దీనికి రాష్ట్ర కమిటీ బాధ్యులు హాజరవుతారని తెలిపారు. మహాసభలలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధన కోసం చర్చించడం జరుగుతుందని రాంనారాయణ తెలిపారు. ఖమ్మంజిల్లా ఎన్నో ప్రజా ఉద్యమాలతో పాటు చారిత్రిక మహాసభలకు అతిథ్యమిచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్ర మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు, జర్నలిస్టులు పూర్తి సహాయ సహకరాలను అందించి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కమిటీ బాధ్యులు ఎన్. వెంకట్రావు, ఖదీర్, టియుడబ్ల్యూజె (ఐజెయు) ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, నాయకులు నలజాల వెంకట్రావు, శివానంద, ఎం. పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, కూరాకుల గోపి, వై. మాధవరావు, ఎస్‌కె మోహినుద్దీన్, తాళ్లూరి మురళి, నామ పురుషోత్తం, జనార్ధనాచారి, మేడి రమేష్, భవాని సింగ్, ఆలస్యం అప్పారావు, ఏలూరి వేణుగోపాల్, కళ్యాణ్, రవికుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బాండ్ల నగదు చెల్లింపులో జాప్యమెందుకు..?

**-ఆర్టిసి కార్మికుల మనోభావాలతో ఆటాడుతున్న యాజమాన్యం**
**-ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి అప్పారావు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్టిసి యాజమాన్యం కార్మికుల పట్ల వివక్షా పూరిత ధోరణి అవలంభిస్తుందని బాండ్లకు సంబంధించిన నగదు చెల్లింపులో ఎందుకు జాప్యం జరుగుతుందని ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం బాండ్ల చెల్లింపుకు సంబంధించి రూ. 281 కోట్లను విడుదల చేసి 40 రోజులు గడుస్తున్నా కార్మికులకు నగదు ఎందుకు చెల్లించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఖమ్మం రీజియన్ అత్యవసర సమావేశం గురువారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాటి అప్పారావు మాట్లాడుతూ బాండ్ల చెల్లింపు విషయంలో ప్రభుత్వ వైఖరికి భిన్నంగా ఆర్టిసి యాజమాన్య వైఖరి ఉందని కొంత భాగాన్ని సీనియార్టి ప్రకారం చెల్లిస్తామని చెప్పినా ఒక్క పైసా కూడా చెల్లించలేదన్నారు. ఎందుకు చెల్లించడం లేదో యాజమాన్యం కార్మికులకు తెలియజేప్పాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. కార్మికుల మనోభావాలతో యాజమాన్యం ఆటలాడుతుందని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అప్పారావు పిలుపునిచ్చారు. యాజమాన్యం స్పందించక పోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. తొలిదశలో డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందజేస్తామని అప్పటికి యాజమాన్య వైఖరిలో మార్పు రాకపోతే ఆందోళన చెపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో అధ్యక్ష, కార్యదర్శులు డి. జగన్నాథం, బి. బుచ్చిబాబు, ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు గోపాలరావు, నాగులమీరా, రఘురాం, రాంబాబు, ఆర్. నాగేంద్రసింగ్, కె. నాగభూషణరావు, రాయప్ప, సుందరం, రమణారావు, మధు, పవన్, లాజర్, హరినాథ్ బాబు, రమాదేవి, అరుణమ్మ పాల్గొన్నారు.

# స్వేచ్ఛ, న్యాయబద్ద ఎన్నికలకు కృషి చేయాలి

**అంతర్ రాష్ట్ర సరిహద్దు పోలీస్ అధికారుల సమన్వయ సమావేశం**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంతర్ రాష్ట్ర సరిహద్దు పోలీసుల సమిష్టి కృషి, సమాచార మార్పిడితో స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికలు నిర్వహించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఏలూరి ఎస్‌పి డి. మేరీ ప్రశాంతి తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అంతర్ రాష్ట్ర సరిహద్దు జిల్లాలో అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు కట్టడి చేసేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఖమ్మం, ఏలూరు జిల్లాల పోలీస్ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఏలూరు ఎస్‌పి మేరీ ప్రశాంతి, ఖమ్మం అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర అంతర్ జిల్లా పోలీస్ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో 24 గంటలు చెక్ పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు చేపట్టేలన్నారు. సరిహద్దులో పటిష్ట నిఘా పెట్టడంతో పాటు అక్రమ మద్యం, నగదు సరఫరాపై నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను నియంత్రించాలన్నారు. ఎన్నికల నియమావళి పరిరక్షణే ధ్యేయంగా సరిహద్దు పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ విషయంలో ఇరు జిల్లాల, రాష్ట్రాల అధికారులు సహకరించుకుంటూ ముందుకెళ్లాలన్నారు. పాత దొంగలు, నేరస్తుల సంచారం కట్టడి, ఇంటలిజెన్స్ సమాచారం పంచుకోవడం తదితర అంశాలపై చర్చించారు. రౌడీ షీటర్లు గతంలో అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, సరిహద్దులో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీస్ అధికారులు వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహాయ సహకారాలు అందించుకుంటూ ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలన్నారు. సరిహద్దుల్లో ఉన్న సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చెక్‌పోస్టులను సంబంధిత అధికారులు ఏర్పాటు చేసుకుని నిరంతరాయంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏసిపి రఘు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి ప్రసన్నకుమార్, జంగారెడ్డి గూడెం డిఎస్‌పి రవి చందర్, నూజివీడు డిఎస్‌పి లక్ష్మ య్య, సరిహద్దు పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. గురువారం పిఎస్‌ఆర్ ట్రస్టు ద్వితీయ వార్షికోత్సవ సందర్భంగా మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ 3 కేంద్రంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య గర్భిణీలకు చీర, సారె అందజేశారు. ఈ సందర్భంగా సిడిపివో కవిత, ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్టు ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని సిడిపివో తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు చాపలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు ఉషారాణి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి , ఆయా కొండమ్మ, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

# వేపకుంట్లలో వైద్య శిబిరం





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వేపకుంట్ల గ్రామంలో మంచుకొండ పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గత కొద్ది రోజులుగా గ్రామంలో ప్రజలు జ్వరాల బారీనపడి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం వైద్యాధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ మాలతి పరిశీలించారు. గ్రామంలో ప్రజలు జ్వరాల బారీనపడుతున్న నేపథ్యంలో ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందించాలని తెలిపారు. ప్రజలు కూడా వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని వేసవి కాలం దృష్ట్యా పనులకు వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పలువురిని పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విష్ణు, నర్సయ్య, నిర్మల జ్యోతి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఎంఇఓ విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలంలో ఎంఇఓ వై.ప్రభాకర్ గురువారం విస్తృతంగా పర్యటించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల్లో భాగంగా మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులను తనిఖీ చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ప్రతి ప్రాథమిక పాఠశాలకు రూ.25వేలు, ఉన్నత పాఠశాలకు రూ. 1లక్ష మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. అనంతరం మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఉపాధ్యాయున్ని విచారించారు. పూర్తి విచారణ అనంతరం నివేదికలను ఉన్నతాధికారులకు పంపించటం జరుగుతుందని,వారిఆదేశాల మేరకుచర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.

# జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైన కృష్ణాపురం విద్యార్థిని



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఖమ్మంలోని మదానవాయిగూడెం టిఎస్‌డబ్ల్యు ఆర్‌ఎస్ పాఠశాలలో 9వతరగతి విద్యార్థిని బొల్లెద్దు హనీ జాతీయ స్థాయి 33వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు. ఈ నెల 31 మార్చి నుంచి ఏప్రిల్ 3వతేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే 33వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తరుపున జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన హనీకి పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

## అందరం స్వచ్ఛందంగా 50 అడుగుల రోడ్డుకై ముందుకు సాగుదాం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి హెడ్ క్వాటర్‌లో రోడ్డు విస్తరణకు 50 అడుగులు ఉండాలని కొరకునే వారు 107 మంది ఉండగా, 45 అడుగుల లోపు కొరుకునే వారు 8 మంది ఉన్నారని మండల హెడ్ క్వార్టర్ అభివృద్ధి కమిటీ తెలిపారు. ఈసందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ మండల కేంద్రంకు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వచ్చే ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండాలని, రానున్న రోజుల్లో రోడ్డు విస్తరణకు సైడ్ డ్రైన్ నిర్మాణం, విద్యుత్ లైన్ మార్పు కోసం విజ్ఞులైన ప్రజలు అభివృద్ధికీ మేము పట్టం కడతామని స్వచ్ఛందంగా హెడ్ క్వారటర్ రోడ్డుకి ఇరు వైపులా ఉన్న ఇండ్లుని కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ, టిడిపి, సిపిఎం, సిపిఐ ఎంఎల్‌పి మాస్ లూన్, బిజెపి పార్టీలతో కూడిన అఖిలపక్ష అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పొజిషన్ సర్వే చేయడం జరిగిందన్నారు. అందులో కేవలం 8 మంది ఇంటి నిర్మాణాలు 45 అడుగుల లోపుట ఉన్నాయని, ఈ 8 మందిలో 4గురు అందరు అభివృద్ధి దారిలోకి వెళ్తున్న నేపథ్యంలో మేము కూడా 50 అడుగులకు సిద్ధం అవుతామని నలుగురు అంటున్నారని తెలిపారు. చాలా సంతోషంగా ఉన్నదని, 100శాతంలో 99శాతం మంది 50 అడుగులు రోడ్డు కావాలని, సైడ్ డ్రైన్ కావాలని, కరెంట్ లైన్ మార్పు కావలని అఖిల పక్షం అభివృద్ధి కమిటీకి మద్దు తెలిపారని ఇది వాస్తమని తెలిపారు. మన ఊరు మన అభివృద్ధి అనే నినాదంతో ఊరంతా ఒక్కటిగా ఉందని, ఊరు అభివృద్ధి కోసం అందరం ఏకంగా నిలుద్దామన్నారు.

## ఉపాధి పనుల్లో హాజరు శాతం తప్పనిసరి



**ప్రజాపక్షం/పినపాకః** ఉపాధి హామీ పనులను పర్యవేక్షించకుండా నిర్లక్షం చేస్తే సహించేదని పినపాక ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. గురువారం పినపాక మండల కేంద్రంలో గల రైతు వేదికలో ఉపాది హామీ పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో, టీఏ, మేట్లు, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు ఇచ్చే డబ్బులు పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే చెల్లిస్తే కూలీల సంఖ్య పెరుగుతోందన్నారు. గ్రామాల వారీగా ఉపాధి పనులకు ఎంత మంది వస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచి, ఉపాధి పనులు నాణ్యతతో చేయించాలని సూచించారు. కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉంచకుండా సక్రమంగా చెల్లించాలన్నారు. హాజరు శాతం కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. కొలత పద్ధతి ఆధారంగా ఉపాధి హామీ కూలీలకు నగదు చెల్లిస్తారని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వరరావు, ఏపిఓ వీరభద్ర స్వామి, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు బట్టలు పంపిణీ



**ప్రజాపక్షం/పినపాకః** గ్రేస్ సర్వీస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో పినపాక మండలంలోని తోగ్గుడెం గ్రామం లోని జి. యాస్. యస్ డే కేర్ సెంటర్ లోని 80 మంది నిరు పేద విద్యార్థులకు గురువారం నూతన వస్త్రాలు పంపిణి చేశారు. ఈ సదర్భంగా ముఖ్య అతిథులు తోగ్గుడెం యూపిఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఇలాంటి కార్యక్రమం లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ కేర్ సెంటర్ ఇంఛార్జి బడే సాగర్, సంస్థ ప్రతినిధులు మురళీ కృష్ణరెడ్డి , సతీష్ డే కేర్ సెంటర్ టీచర్ మైపా రమాదేవి, ఆయా కాంతమ్మ, గ్రామస్తులు పలువురు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని బైరవునిపల్లి గ్రామంలో ఏఐవైఎఫ్ మండల కౌన్సిల్ సభ్యుడు బుర్ర సాయిసాత్విక వివాహానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ హజరై నూతన వధువరులను ఆశ్వీరదించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కనకబండి సీతారాములు, మల్లేబోయిన ఉపేందర్, టీడీపీ జిల్లా నాయకులు నూక హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు గోళ్ల శ్రీనివాసరావు, మల్లేబోయిన శ్రీనివాస్, గండు సైదులు, పి.లక్ష్మి నారాయణ, దొడ్డ శ్రీనివాస్, కనకబండి రమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు





**జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. గురువారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూ రక్షణ బృందాలతో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ పై కలెక్టర్ విపి గౌతమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాలు గుర్తింపు చేసి అట్టి జాబితాను తగు చర్యల నిమిత్తం భూ రక్షణ బృందాలకు అందజేసినట్లు ఆయన తెలిపారు. వాటిపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. స్థలాల వారీగా అధికారులు చేపట్టిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. ఖాళీ స్థలాల్లో క్రమబద్ధీకరణ, జీవో 59లో చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురైన చోట వెంటనే స్థలాలు స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్, సిసి కెమెరాలను ఏర్పాటు చేసి రక్షణా చర్యలు చేపట్టాలన్నారు. బృందాలు క్షేత్ర పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలన్నారు. రక్షణా బృందాలు క్రియాశీలకంగా పనిచేయాలని ప్రతి ప్రభుత్వ స్థలం పరిరక్షణ చేయాలన్నారు. వైఎస్ఆర్ కాలనీలో ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు కేటాయించిన అసైన్డ్ భూమిపై సర్వే చేసి సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. ఎన్ని ప్లాట్లు ఉన్నవి, ఎన్ని ప్లాట్లలో నిర్మాణాలు ఉన్నవి, ఎన్ని ఖాళీ ఉన్నవి తనిఖీ చేయాలన్నారు. ప్లాట్ల విషయమై ఆధారాలకు నోటీసులు ఇవ్వాలన్నారు. పువ్వాడ ఉదయ్‌నగర్‌లో ఖాళీ ప్లాట్ల విషయమై చర్యలు చేపట్టాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లలో లబ్దిదారులు నివాసం లేని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న నిర్మాణాలను గుర్తించి తొలగించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

## మండే ఎండలతో జాగ్రత్తగా ఉండాలి



**ప్రజాపక్షం/కల్లూరుః** వడదెబ్బతో అప్రమత్తతే ఎంతో అవసరమని మండే ఎండలతో వడదెబ్బ తగిలే అవకాశం ఉందని దీని వలన ఉదయం 11 గంటల లోపు తమ తమ అవసరాలను తీర్చుకోవాలని నాలుగు గంటల తర్వాత బయటకు మళ్ళీ వెళ్ళవచ్చు అని వైద్యులు నవ్య కాంత్ తెలిపారు. చెమట పట్టకపోవడం శరీర ఉష్ణోగ్రతలు పెరగడం వణుకు పుట్టడం మగత లేక కలువరింతలు రావడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వడదెబ్బకు కారణాలు. తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే బయటకు పోవద్దని రోడ్ల వెంట అమ్మే చల్లని రంగు పానీయాలు తాగరాదని, రోడ్లమీద అమ్మే కలుషిత ఆహారం తినకూడదని మద్యం సేవించరాదని, మాంసాహారాన్ని తగ్గించి, తాజా కూరగాయల ఆహారాన్ని తీసుకోవాలని పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా చేయవలసినవి జాగ్రత్తలు నీరు, పళ్ళ రసాలు కొబ్బరి నీళ్లు, మజ్జిగ ద్రవ పదార్థాలు ఎక్కువ తీసుకోవాలని లేత రంగు తెల్లని దుస్తులు వాడాలని, ప్రతిరోజు 15 గ్లాసుల మంచినీరు త్రాగాలని ఆహారం తక్కువ మోతాదులో, ఎక్కువసార్లు తినాలని, అత్యవసరంగా బయటకు వెళ్లాలనిపిస్తే గొడుగు తెల్లని టోపీ ధరించాలని వైద్యులు సూచించారు. ప్రథమ చికిత్స వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు చేర్చాలి. వెంటనే తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలి. మజ్జిగలో ఉప్పు కలిపి తాగించాలి. పిల్లలు వృద్ధులు గర్భిణీలు ఎండాకాలం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వడదెబ్బ తగిలి ఉన్న వ్యక్తికి వెంటనే నీరు తాగించకూడదని సమీపంలోని వైద్యశాలకు తీసుకెళ్లాలని మండల ప్రజలను కోరారు. మండలంలోని పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు మే నెల చివరి వరకు మండే ఎండలు కు అధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారని కావున పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందని తప్పనిసరిగా అవి పాటించాలని మండల ప్రజలను కోరారు. ఇంకను పలు సలహాలు సూచనలకు సమీపంలోని వైద్యశాలను కానీ ఆశ, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని వైద్యులు నవ్య కాంత్ కోరారు.

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులో గల రామానగర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం ప్రారంభ పూజా కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామానగర్ కాలనీ శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయ కమిటీ సభ్యులు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాగమయిని, జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు ఏనుగు సత్యంబాబు, షేక్ యాకోబు అలి, యాసా శ్రీకాంత్, ధారా రంగా, షేక్ ఉస్మాన్, బైర్ల కాంతారావు, సంఘం రామకృష్ణ, నోటి కృష్ణారెడ్డి, పొన్నూరు వెంకటేశ్వరావు, పసుపులేటి శ్రీనివాసరావు, తోట సుబ్బారావు, మేకల సాంబశివరావు, గుండ్ల రవీంద్ర, బొల్లం ఉపేందర్ గౌడ్, బొడ్డు తిరుపతిరావు గౌడ్, షేక్ యూసుఫ్, కుసునూరు బాల నాగేశ్వరరావు, షేక్ మైబూ, నల్లగట్ల కిషోర్ బాబు, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, రామానగర్ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తారక రామ ఆటో నగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్ ప్రారంభించారు. గురువారం 46వ డివిజన్ పరిధిలో ఎఫ్‌సిఐ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్న సొసైటీ బాధ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ నగర అధ్యక్షులు బానాల లక్ష్మణ్, ఎస్టి సెల్ నగర అధ్యక్షులు శంకర్ నాయక్, షేక్ రజీ, బోజడ్ల సత్యనారాయణ, రవీంద్ర, జాకీర్, సాయికిరణ్, మల్లయ్య, శ్రీనివాస్, రమేష్, హీమాంపాషా, నజీర్, ఆటో నగర్ అధ్యక్షులు కేసుగాని రవి, మహంకాళి మల్లికార్జున్, ఘంటా భీమయ్య, శ్రీశైలం, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యాక్షన్ ప్లాన్ సిద్ధం

**-మత్తు పదార్థాల దిగుమతి కాకుండా చర్యలు**
**-బోర్డర్ చెక్ పోస్ట్‌ల బలోపేతం**
**-ఉమ్మడి ఖమ్మం జిల్లా అబ్కారీ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి**




**ప్రజాపక్షం/బూర్గంపాడు :** పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఎక్సైజ్ అధికారుల సహకారంతో తెలంగాణలోకి మద్యం, నాటు సారాయి, గంజాయి లాంటి మత్తు పదార్థాలు దిగుమతి కాకుండా చర్యలు తీసుకోవాలని యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా అబ్కారీ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం రాబోయే లోక్ సభ ఎన్నికల దృష్ట్యా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ బోర్డర్ కో ఆర్డినేటర్ మీటింగ్ సారపాక ఐటిసి పేపర్ బోర్డ్ ప్రాంగణంలోని మయూని సమావేశ మందిరంలో కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసామవేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛతీష్‌ఘడ్ రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. ఈసమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తాత్కాలిక బోర్డర్ చెక్ పోస్ట్‌ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న చెక్ పోస్టులను బలోపేతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పొరుగ రాష్ట్రాల అధికారులతో కలిసి సరిహద్దు ప్రాంతాలలో ఉమ్మడి దాడులు నిర్వహించి ఎక్సైజ్ నేరాలను అరికట్టేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఈసమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ సూర్య చందర్‌రావు, ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ రామకృష్ణ, సుక్మా జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ గజేందర్, బీజాపూర్ జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ రాహుల్, కొత్తగూడెం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ కరం చంద్, భద్రాచలం ఎస్‌హెచ్‌వో రహీమున్నిసా బేగం, కొత్తగూడెం డిటిఎఫ్ సిఐ సాంబమూర్తి, జంగారెడ్డిగూడెం ఎస్ఈబీ సిఐ పట్టాభి, చింతలపూడి ఎస్ఈబీ సిఐ ప్రసాద్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రామభక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి



**- ఆర్‌డిఓ దామోదర్ రావు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారాములు కళ్యాణ మహోత్సవానికి, పట్టాభిషేకానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఓ దామోదర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ సమావేశ మందిరంలో శ్రీరామనవమి ఏర్పాట్ల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణం జరిగే మిథిలా స్టేడియంలో 26 సెక్టార్లుగా విభజించినట్లు తెలిపారు. ప్రతీ సెక్టార్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలు వీక్షించేందుకు చర్యలు చేపేడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం పర్యవేక్షకులుగా జిల్లా అధికారులు ఉంటారన్నారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా లాడ్జీలు బుక్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా ఇప్పటికే ఆన్‌లైన్ టిక్కెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పిస్తామని, విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక కార్డులు జారీ చేస్తామన్నారు. పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు పట్టణాన్ని 25 జోన్లుగా విభజించామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీటి సదుపాయంతో పాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు గోదావరిలో స్నానాలకు దిగుతుండారని, నదీలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. కళ్యాణ మండపంలోనికి వచ్చే సమయంలో రద్దీకి అనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి నదిపై ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకోవాలని, అత్యసర పరిస్థితుల్లో వాహనాలు నిలిచిపోతే వాటిని క్రైన్ల ద్వారా తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఒక్క రోజు ముందు నుండే వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం ఆస్పత్రిలో బెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తలంబ్రాల పంపిణీ విషయంలో ఎలాంటి లోటుపాట్లు దొర్లకుండా ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఇందు కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులకు సమగ్ర సమచారాన్ని అందించేందుకు సమాచార కేంద్రాలు 24 గం.పాటు పనిచేయాలని, ఉత్సవాలు ముగిసేంత వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా సిబ్బంది పనిచేసి వేడుకలు విజవతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో జరిగే పనుల పూర్తి చేయాలి



**- ఐటిడిఏ పిఓ ప్రతీక్ జౌన్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా గిరిజన గ్రామాల్లో జరిగే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఐటిడిఏ నుండి ఐటిడిఏ పరిధిలోని ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఆదివాసి గిరినజ గ్రామాల్లో స్మశానవాటికలు, అంగన్‌వాడీలు, ఆశ్రమపాఠశాలలు, జిపిఎస్ పాఠశాలలు, సబ్ సెంటర్లు, సైడ్ కాలువల పనులకు నిధులు కేటాయించినందున వాటి పురోగతి తెలపాలన్నారు. మిగిత పనులకు ప్రతిపాదనలు పంపి పనులు చేపట్టాలన్నారు. గిరిజన విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకుండా అదనపు తరగతి గదులు నిర్మించాలని, విద్యుత్ సదుపాయం కల్పించాలని, పెండింగ్ కరెంట్ బిల్లులు కట్టాలనిఅన్నారు. మంచినీటి సమస్య ఉన్న చోట ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, సబ్ సెటర్ల మరమ్మత్తులు పూర్తి చేయాలని, నిధులు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెల 10 నాటకి పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు పూర్తి కాకుండా బిల్లులు చెల్లిస్తే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు, ఇఇ తానాజీ, ఎస్ఓ సురేష్ బాబు, డిఇలు, ఏఇలు తదితరులు పాల్గొన్నారు.

## టెట్ ఫీజును వెంటనే తగ్గించాలి

**ప్రజాపక్షం/కరకగూడెం:** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫీజును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్ ఫీజు రూ 200 నుంచి రూ 1000కి పెంచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 27 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుందని, అయితే ఈసారి అప్లికేషన్ ఫీజులు భారీగా పెంచడంతో నిరుద్యోగుల పైన ఫీజు భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనోటిఫికేషన్‌లో ఒక పేపర్‌కు దరఖాస్తు చేసుకుంటే రూ వెయ్యి , రెండు పేపర్లకు రూ 2వేలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ఒకేసారి ఫీజు పెంచడం కారణంగా అభ్యర్దులు అనేక రకాలుగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందికి గురవుతారని, ప్రభుత్వం నిరుద్యోగుల పైన అప్లికేషన్ల పేరుతో వసూలు చేసేటటువంటి వైఖరి సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోటీ పరీక్షలకు ఎలాంటి అప్లికేషన్ ఫీజులు వసూలు చేయమని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి, నేడు అప్లికేషన్ల ఫీజు పేరుతో భారీగా వసూలు చేయడం నిరుద్యోగ యువతకు అన్యాయం చేయడమే అని అన్నారు. వెంటనే టెట్ అప్లికేషన్ ఫీజు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## అన్నదానానికి రూ.2 లక్షల విరాళం



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీసీతారామ చంద్ర స్వామివారి ఆలయంలో జరిగే నిత్యాన్నదానికి పట్టణానికి చెందిన భక్తులు రూ.2 లక్షల విరాళాన్ని గురువారం ఆలయంలో అందజేశారు. పట్టణంలోని తాతగుడి సెంటర్‌కు చెందిన గొండేలవెంకటేశ్వరరావు, రత్నకుమారి దంపతులు అన్నదానం నిమిత్తం అందజేసిన సొమ్ముకు ఆలయం నుండి పత్రాన్ని సైతం అందజేశారు. తమా అందించిన సొమ్మును బ్యాంకులో డిపాజిట్ చేసి దాని ద్వారా వచ్చే వడ్డీతో రామభక్తులకు అన్నప్రసాదం అందించాలని దాతలు కోరారు.

## ఉచిత గాలికుంటు నివారణ టీకాలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రంలోని చింతోళ్ళగుంపు, రామానుజగూడెం, పాతూరు గ్రామాలలో గురువారం ఉచిత గాలికుంటు టీకాలు సుమారు 300 పశువులకు టీకాలు వేయడం జరిగిందని పశుసంవర్ధక శాఖ ఉమ్మడి జిల్లా అడిషనల్ డైరెక్టర్ అరుణ తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని, పశువుల ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఆరు నెలల నుంచి సంవత్సరం లోపు దూడలకు రక్త నమూనాలను సేకరించారు. ఈకార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డాక్టర్ సంతోష్, పశు గణన సహాయకుడు రోళ్ల కంటి రమేష్‌బాబు, గోపాల మిత్రులు సయ్యద్ యూనిస్ పాషా, కొమరం నారాయణ, గోగ్గల సుజాత, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా దూలుగొండ తల్లి జాతర



**ప్రజాపక్షం/గుండాల :** ఈసం వంశీయుల ఇలవేలుపు అయున దూలుగొండ తల్లి జాతరను గురువారం వారి ఆచారాల ప్రకారం అంగరంగ వైబవంగా నిర్వహించారు. తలపతులు , వడ్డెలు అత్యంత భక్తి శ్రద్దలతో పూజలునిర్వహించి మేళతాలాలతో, డప్పునృత్యాలతో గురువారం దేవతను గద్దెలపై ప్రతిష్టించారు. దేవత గద్దెలపైకి చేరుకోవడంతో వేలాదిగా భక్తులు తల్లిని దర్శించుకొని కోరిన కోర్కెలు నెరవేరాలని, పిల్లాపాపలుచల్లంగా ఉండాలని , పాడిపంటలు సమృద్ధిగా పండాలని మేకలు,కోళ్ళను బలిఇచ్చి మొక్కులను తీర్చుకున్నారు. వీరి ఆచార ప్రకారం ప్రతి సంవత్సరం హోళిపున్నమిలో బుధ,గురు, శుక్రవారం మూడురోజుల పాటు ఈ జాతరను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి అద్యక్షులు ఈసం క్రిష్ణ, కోశాదికారి, సమ్మయ్య, ప్రదాన కార్యదర్శి రామూర్తి, ఈసం పాపరావు, కార్యదర్శి ఈసం క్రిష్ణ, కమిటి సభ్యులువెంకటనారాయణ, మల్లయ్య, బిక్షం, సాంబయ్య, జోగయ్య, వడ్డెలు, తలపతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీదేవి జాతర



**ప్రజాపక్షం/గుండాల :** జోగవంశీయుల ఆరాధ్యదైవంగా కొలిచే శ్రీలక్ష్మి దేవి జాతరను తూరుబాక గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్దలతో పూజలను నిర్వహించి వారి ఆచార ప్రకారం లక్ష్మి దేవి ప్రతిమను గుడిలో ప్రతిష్టించిన అనంతరం , భక్తులు దేవతమూర్తి ప్రతిమలను గ్రామంలో భక్తి శ్రద్దలతో నాట్యప్రదర్శనతో ఊరేగింపునిర్వహించారు. ఇదేరోజున లక్ష్మి దేవి గంగాస్నానము, దేవతానాట్యప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులకు జామరుగూడెం గ్రామానికి చెందిన పాయం సుదాకర్ టిషర్టులను అందించారు సుదాకర్‌కు కమిటి సభ్యులు ప్రత్యేక అబినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారులు జోగదమ్మయ్య, పెద్దజోగయ్య, రాంబాబు(టీచర్), బచ్చయ్య, చిన్ననర్సయ్య, సారయ్య, పోతయ్య, సమ్మయ్య, పగడయ్య, జోగబద్రయ్య, క్రిష్ణ, శివపూజారులు, జోగలక్ష్మయ్య, ఈసం లింగయ్య, యాప సందయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై గురువారం ఐడిఓసి కార్యాలయంలో పౌరసరఫరాల సంస్థ, శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లపై కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు, వ్యవసాయ, సహకార, డిఆర్‌డిఏ, తూనికలు కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ,రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 111369 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనాతో 128 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏ,బి గ్రేడ్‌లుగా విభజించిన మద్దతు ధర ప్రకటించినట్లు చెప్పారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2183 మద్దతు ధర నిర్ణయించినట్లు చెప్పారు. వచ్చే నెల 1న 16, 5న 36 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ప్రజాప్రతినిధులకు చెందిన ఫ్లెక్సీలు, ఫోటోలు పెట్టరాదని ఆదేశించారు. ఈ సారి ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, హమాలీలు వడదెబ్బకు గురికాకుండా టెంట్లు, షెడ్ నెట్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 2023 24 సిఎంఆర్ ఖరీఫ్ డెలివరీలు సకాలంలో చేసేలా రైసు మిల్లులు తనిఖీ చేసి వారంలోగా నివేదికలు అందించాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. అనంతరం మద్దతు ధర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్‌డిఓ విద్యా చందన, పౌర సరఫరాల మేనేజర్ త్రినాధ్, పౌరసరఫరాల అధికారి రుక్మిణి, డిసిఓ కుర్షిథ్, వ్యవసాయాధికారి బాబూరావు, జిసిసి మేనేజర్ విజయ్ కుమార్, తూనికలు, కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి అలీం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు ఆనందరావు, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

# మావోయిస్టు డిప్యూటీ కమాండర్, కొరియర్ అరెస్ట్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మావోయిస్టు ఎల్ఓఎస్ డిప్యుటీ కమాండర్‌తో పాటు మరో మావోయిస్టు కొరియర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా, గంగలూరు పిఎస్ పరిధిలోని పూస్తార్ గ్రామానికి చెందిన ఎస్ఓఎస్ కమాండర్ పుట్టం మున్నా అలియాస్ సన్నాల్, ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందిన మావోయిస్టు కొరియర్ జాడి పెద్దబ్బాయిలు ఉన్నారు. ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, సిఆర్‌పిఎఫ్ 151 బెటాలియన్, 204 బెటాలియన్ కోబ్రా బలగాలు దుమ్ముగూడెం మండల పరిధిలోని ములకనపల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఇరువువు తారసపడటంతో వారిని పశ్నించారు. వారు మావోయిస్టులుగా ఒప్పుకోవడం అరెస్టు చేశారు. డిప్యుటీ కమాండర్ మున్నా 2004 నుండి మావోయిస్టు దళంలో పనిచేస్తున్నాడు. మడివి హిడ్మా, సంతోష్ నాయకత్వంలో పనిచేశాడు. పలు విధ్వంకర సంఘటనలో పాల్గొన్నాడు. 2007లో తాడిమెట్ల వద్ద 12 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను చంపిన ఘటనతో పాటు, 2010 లో చింతల్నార్ అటవీ ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్‌కు చెందిన 76 మంది జవాన్లను హతమార్చిన ఘటన, 2013లో కిష్టారం వద్ద సిఆర్‌పిఎఫ్ జనాన్లను, 2018 లో 9 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను, 2021లో జిరాం ఘాట్ సంఘటనలో 21 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను హతమార్చిన ఘటన, ఇటీవల ఏర్పాటు చేసిన ధర్మారం బేస్ క్యాంపుపై దాడిచేసిన ఘటనలో నింధితుడు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఇతనిపై రూ.5 లక్షల రివార్డు ఉంది. అరెస్టు కాబడ్డ కొరియర్ గత మూడేళ్లుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఫస్ట్ బెటాలియన్ మావోయిస్టులకు కొరియర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరి వద్ద నుండి ఒక కిట్‌బ్యాగు, పది జిలిటెన్ స్టిక్స్, రెండు ఎలక్ట్రికల్ డిటోనేటర్లు, మావోయిస్టు కరపత్రాలు స్వాదీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్పి తెలిపారు.

# అనాథ పిల్లల అభివృద్ధే నా లక్ష్యం





**- డాక్టర్ బాబురావు**
**-ఉచితంగా చిన్నారులకు**
**స్కూల్ బ్యాగ్స్ స్టేషనరీ అందజేత**

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** కొత్తగూడెం పట్టణంలోని ప్రముఖ అమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ బాబురావు ఔదార్యం చాటుకున్నారు. స్నేహలత, సంధ్యలత అనాధ బాలబాలికల ఆశ్రమంలో దాదాపు 40 మంది చిన్నారులకు డాక్టర్ జయ, ఎండి సుగర్ స్పెషలిస్ట్, డాక్టర్ బాబురావు, ఎండి ఎమర్జెన్సీ చెస్ట్ స్పెషలిస్ట్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబురావు మాట్లాడుతూ చిన్నారుల చదువుకు తమవంతు చేయూత అందించేందుకు స్కూల్ బ్యాగ్‌లు అందజేయడం జరిగిందన్నారు. చిన్నారులు మంచిగా చదువుకొని భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అమృతమల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎదగాలని ఆకాంక్షించారు. అమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, రాబోవు కాలంలోను మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతి మనిషి విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత ఉద్యోగాలను స్థిరపడి సమాజ అభివృద్ధికి దోహదపడాలని నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న బీద బలహీన వర్గాల ప్రజలకు విద్య, వైద్యం అందించుటకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమృత హాస్పిటల్ సిబ్బంది, నదాన్ పరిండే ఫౌండేషన్ మాన్కైండ్ ఫార్మసీ కొత్తగూడెం మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, మెడికల్ రిప్రజెంటేటివ్ అరుణ్‌కుమార్, అమృతరావు, మాధుర్య, అక్షరరావు, ఆశ్రమ నిర్వాహకులు సముద్రాల కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాతృ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సామగ్రి అందజేత



**ప్రజాపక్షం/కరకగూడెం:** పినపాక మండలంలోని తోగూడెం గ్రామానికి చెందిన వారు హైదరాబాద్ నగరంలోనీ ఉప్పల్ ప్రాంతంలో గత మాతృ అభయ ఫౌండేషన్ నిర్వాహకులు రామటెంకి రమేష్, దేవకాదేవి దంపతులు, ప్రొఫెసర్ జాడి మురళీ ధర్ చేతుల మీదుగా నేటి తరం విద్యార్థులకు పరిజ్ఞానిక విద్య ఎంతో ప్రాముఖ్యతమైనదని గమనించి మారుమూల ప్రాంతాల్లో గల అనంతారం, కరకగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలకు కంప్యూటర్‌లు, విద్యార్థులకు ఎగ్జామ్స్ కు అవసరమయ్యే సామగ్రితో పాటు స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. పాఠశాలలతో పాటు అశ్వాపురంపాడు, అంగారిగూడెం అంగన్వాడీకి దుస్తులను ఆట వస్తువులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారి జీవితంలో అత్యున్నత ఆశలను సాధించడానికి శ్రమించాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తు ప్రణాళికలు విద్యార్థి దశ నుండే ఎంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల లక్ష్యాల అనుగుణంగా వారికి సహాయ సహకారాలు అందించాలని వారు తెలిపారు. ఏజెన్సీ గ్రామాలలో ఉన్న విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రొఫెసర్ జాడి మురళీ ధర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ముగిసిన పోలింగ్.. నిలిచిన కౌంటింగ్

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం 946 ఓట్లకు గాను 757 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు చేపడతామని తొలుత ప్రకటించారు. కానీ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల ప్రకారం కౌంటింగ్‌ను నిలిపివేసినట్లు ఎన్నికల అధికారి మారగాని శ్రీనివాసరావు తెలిపారు. బార్ కౌన్సిల్ ఉత్తర్వులకు అనుగుణంగా ఎన్నికల లెక్కింపు జరుగుతుందని ఆయన తెలిపారు.

# కదిలిన అధికార యంత్రాంగం

**-తాగునీటి నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**
**-ప్రజాపక్షం కథనానికి స్పందించిన యంత్రాంగం**





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** అధికార యంత్రాంగంలో కదలిక మొదలైంది. నీటి ఎద్దడికి సంబంధించి ప్రజాపక్షం అడుగంటిన భూగర్భ జలాలు అనే శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనికి అధికార యంత్రాంగం స్పందించి తిరుమలాయపాలెం మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను మొదలు పెట్టారు. గడిచిన ఎనిమిదేళ్లుగా తిరుమలాయపాలెం మండలంకు భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు, తాగునీటికి ఢోకా లేకుండాపోయింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నాగార్జున సాగర్‌తో పాటు పాలేరు మధ్యతరహా ప్రాజెక్టులో కూడా నీరు అడుగంటి పోవడంతో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. కరువు మండలంగా పేరున్న తిరుమలాయపాలెం కు ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా కల నెరవేరిందనుకుంటున్న సమయంలో వర్షాభావ పరిస్థితి తిరిగి వెనకటి పరిస్థితిని సృష్టించింది. బావులు అడుగంటిపోయాయి. బోర్లు ఎండిపోయాయి. దీనిపై ప్రజాపక్షం ప్రత్యేక కథనాన్ని ప్రచురించడంతో అధికారులు కదిలి ఎక్కడికక్కడ తాగునీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పైపులైన్ నిర్మాణాలు జరుపుతున్నారు. గ్రామాలలో ప్రత్యేకించి అత్యధిక గిరిజన జనాభా ఉన్న తిరుమలాయపాలెం మండలంలో బోర్లను మరమ్మతు చేస్తున్నారు. మంచినీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు పంచాయితీ కార్యదర్శుల నుంచి నివేదికలు తెప్పించుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం ప్రచురించిన ప్రత్యేక కథనం, అందుకు అధికారులు స్పందించిన తీరుపై ప్రజలు ప్రజాపక్షంకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల ఉదాసీన వైఖరిని ప్రజాపక్షం వెలుగులోకి తేవడం వల్లే చర్యలు ప్రారంభమయ్యాయని పలువురు ప్రజాపక్షం కు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ కట్టడాలు కూల్చివేత

-నిరుపయోగంగా ఉన్న స్థలాలు స్వాధీనం
-అర్బన్ తహసీల్దార్ స్వామి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అక్రమ కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ నగర్ కాలనీ సమీపంలో ప్రభుత్వం సర్వే నెం. 37లో స్వాతంత్ర్య సమరయోధులకు, ఎక్స్ సర్వీస్ మెన్లకు ఇండ్ల స్థలాలు కేటాయించింది. అట్టి ఇండ్ల స్థలాలకు నకిలీ పట్టాలు తయారు చేసి విక్రయాలు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. పలువురు బేస్‌మెంట్లు, రేకుల షెడ్లు నిర్మించారు. దీనికి సంబంధించి ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు దృష్టిసారించి అక్రమంగా నిర్మించిన కట్టడాలను గురువారం కూల్చివేశారు.

**నిరూపయోగంగా ఉన్న స్థలాలు స్వాధీనం : తహసీల్దార్ స్వామి**

అసైన్డ్ చేసిన స్థలం నిరూపయోగంగా ఉండడంతో తిరిగి స్వాధీనం చేసుకుంటున్నట్లు ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సిహెచ్ స్వామి తెలిపారు. 1997, 2005 సంవత్సరంలో వైఎస్ఆర్ కాలనీ సమీపంలో సర్వే నెం.37లో స్వాతంత్ర్య సమరయోధులకు ఒక్కొక్కరికి 144 చదరపు గజాల చొప్పున 439 మందికి ప్రభుత్వ స్థలాన్ని అసైన్డ్ చేసిందన్నారు. అట్టి స్థలంలో అసైన్డ్ చేసిన వారు ఉండక పోవడం కొందరు అట్టి స్థలాలను మరొకరికి అమ్ముకోవడం జరిగినట్లు



ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అసైన్డ్ భూమిని ఏ ఉద్దేశం కోసం ప్రభుత్వం ఇచ్చిందో దాని ప్రకారం ఇండ్లు కట్టుకుని నివాసం ఉండాలి కానీ ఇతరులకు అమ్ముకోవడం వీలులేదన్నారు. సుమారు 25 సంవత్సరాలుగా అసైన్డ్ చేసిన స్థలాలు నిరూపయోగంగా ఉండడంతో అట్టి స్థలాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా



గురువారం అట్టి స్థలాల్లో ఉన్న 20 బేస్‌మెంట్లు, 20 షెడ్లను రెవెన్యూ, మున్సిపల్, పోలీసుల ఆధ్వర్యంలో తొలగించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఇట్టి స్థలాలపై అభ్యంతరాలు ఉన్న వారు తమ వద్ద ఉన్న ఒరిజినల్ పట్టాలతో ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

## సిపిఐ ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన

**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా వైరాలో వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో గత నాలుగు నెలల్లో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్లపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అవినీతికి పాల్పడ్డ అధికారులు సస్పెండ్ చేయాలని, ఏజెన్సీ గ్రామాల్లో జరిగిన రిజిస్ట్రేషన్లపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేశారు. కుటుంబ సభ్యుల సర్టిపికెట్లు లేకుండా రిజిస్ట్రేషన్ చేయవచ్చునా అని ప్రశ్నించారు. కొంతమంది రిజిస్టర్ కార్యాలయం వద్ద ఉన్న డాక్యుమెంట్ రైటర్లు ప్రైవేటు సంస్థలతో లోపకారిక ఒప్పందాలు ఏర్పాటు చేసుకొని ఏజెంట్లను పెట్టి బ్యాంకు లోన్ల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ అందినకాడికి దోచుకుంటున్నారని అసలు దళారీ వ్యవస్థ దేనికోసం ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున అనుమతులు లేకుండా రిజిస్ట్రేషన్ చేయడం పట్ల విజిలెన్స్ ఎంక్వయిరీ చేయించి అవినీతికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని అన్నారు. ఏన్కూరు మండలంలో ఏజెన్సీ యాక్ట్ 1/70 అమలల్లో ఉంటే దానికి విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండానే కుటుంబ సభ్యులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు లేకుండానే రిజిస్ట్రేషన్ చేయడం ఏమిటి అని ప్రశ్నించారు. కొణిజర్ల మండలంలో ప్రభుత్వ భూములను గ్రామ పంట భూములను సైతం ఇళ్ళు లేకుండా రిజిస్ట్రేషన్ చేశారని, వాటిపై కూడా విచారణ జరపాలని అన్నారు. వైరా



మున్సిపాలిటీ పరిధిలో, మండలంలో కూడా పెద్ద ఎత్తున తప్పుడు రిజిస్ట్రేషన్లు చేశారని, వాటిపై విచారణ చేయాలని సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని తెలిపారు. అసలు సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణలో డాక్యుమెంట్ రైటర్లలో ఆనుకొని ఉండొచ్చా అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అవినీతి రిజిస్ట్రేషన్లపై తప్పుడు రిజిస్ట్రేషన్‌లపై చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, రైతు సంఘం నాయకులు కొండా రామకృష్ణ, ఏఐటియుసి మండల కార్యదర్శి గారపాటి అశోక్, దొబ్బల కృష్ణయ్య, మూట కొండ, బండారుపల్లి ముత్తయ్య, మోరు శ్రీనివాసరావు, చింతపల్లి గోపాలరావు పాల్గొన్నారు.

## కదులుతున్న సిఎం రిలీఫ్ ఫండ్ అక్రమాల డొంక

**- మాజీ ఎంఎల్ఏ సహాయకుని అరెస్టు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిఎం సహాయ నిధి చెక్కులకు సంబంధించి అక్రమాల డొంక కదులుతుంది. ఒక్కొక్కరుగా అక్రమార్కులు బయటపడుతున్నారు. అనారోగ్యం పాలై ఆర్థిక స్థోమత లేక ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం పేద, మధ్య తరగతి ప్రజలు దరఖాస్తు చేసుకుంటే ఆ మంజూరైన మొత్తాన్ని పక్కదారి పట్టించి పెద్ద మొత్తంలో కొందరు సొమ్ము చేసుకున్నారు. కొందరైతే నకిలీ దరఖాస్తులను తయారు చేసి మంజూరైన చెక్కులను స్వాహా చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో ఈ అక్రమాలు పెద్ద మొత్తంలో జరిగాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజక వర్గంలోను ముఖ్యమంత్రి సహాయ నిధి విషయంలో పెద్ద ఎత్తున అకమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి విచారణ చేపట్టిన అధికారులు మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు వ్యక్తిగత సహాయకుడు వంశీ ని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతని వద్ద నుంచి పూర్తి వివరాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకా ఎంత మంది అక్రమార్కులు ఈ కేసులో అరెస్టు కానున్నారో అన్న చర్చ సాగుతుంది. మొత్తానికి అక్రమార్కుల గుండెల్లో కాస్త వణుకు మొదలైంది.

## ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు రిజిస్ట్రేషన్ స్టాంపు డ్యూటీ మినహాయించాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని 1/70 యాక్ట్ అమలులో ఉన్న ఏన్కూరు మండలంలోని ఆస్తుల బదలాయింపు యాక్ట్ లోబడి జరగడం లేదని, అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, పదే పదే ప్రసార మాధ్యమాల్లో వస్తున్నాయని, సంబంధిత శాఖ అధికారులు వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్ట్రేషన్‌లను పరిశీలించడం ఏన్కూరు మండలంలోని గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆస్తుల బదలాయింపు చేయించి ప్రైవేటు బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ఎగబడి దళారులను నియమించి లక్షల రూపాయల మోసానికి గురిచేస్తున్న విషయం గుర్తించిన గిరిజన సంఘం నేతలు భూక్యా వీరభద్రం, బానోతు హరిచంద్‌లు గురువారం వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. సబ్ రిజిస్ట్రార్ కరుణను కలిసి అక్రమ రిజిస్ట్రేషన్‌లను ఆపాలని డిమాండ్ చేశారు. అంతేగాక గిరిజనుల స్టాంప్ డ్యూటీ మినహాయించాలని కూడా ఒక మెమొరాండం అందజేశారు. ఐదో షెడ్యూల్ ఏరియాలో ఉన్న ఏన్కూరు మండలం గిరిజన చట్టాలకు భిన్నంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేయడం చట్ట ఉల్లంఘన పాల్పడటం అవుతుందని, ఇది సరైంది కాదని గుర్తు చేశారు. అంతేగాక గిరిజన చట్టాల అమలు విషయమై జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రైవేటు రుణాల పేరుతో అమాయక గిరిజనులను మోసగిస్తున్న వైనాన్ని వివరిస్తామని, ఇచ్చిన రుణాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రైవేటు బ్యాంకుల ప్రచార బోర్డులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కరుణ వెంటనే తొలగించారు. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 చట్టానికి విఘాతం కలిగించే చర్యలను అరికట్టాలని, 1/78 సవరణ ప్రకారం ఆస్తుల బదలాయింపు విధిగా జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని, చట్టం నిర్దేశిస్తుందని దాని ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేయాలని కూడా రిజిస్ట్రార్‌కు తెలిపారు. గరిజన చట్టాలు ఉల్లంఘనపై రాష్ట్ర గిరిజన ప్రిన్సిపాల్ సెక్రటరీ ఫిర్యాదు చేస్తామని చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ చేపట్టి మధ్య దళారుల, ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులు భాగస్వామ్యం అయినా రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కులమతాలకతీతంగా ఇఫ్తార్ విందు




**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఖురాన్ పారాయణం పూర్తి చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం రుద్రంపూర్‌లో కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్ శాఖ అధ్యక్షులు అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ ప్రతిఏటా రంజాన్ మాసంలో ముస్లీం సోదరీ సోదరీమణులు ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షలను నిర్వహిస్తారని అన్నారు. దీక్ష అనంతరం కులమతాలతో సంబంధం లేకుండా ఈ ప్రాంతంలోని ప్రజలందరికి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం రుద్రంపూర్ ప్రాంతాల్లో నివసించే ప్రజానికం కులమత బేధాలు లేకుండా ఒకరు సాంప్రదాయాలను ఆచారాలను మరొకరు పాల్పంచుకుంటూ సంస్కృతిగా వస్తున్న పండుగలను నిర్వహించుకుంటున్నారు. ఖురాన్ అవతరించిన మాసం రంజాన్ మాసం అని, ఖురాన్ మానవలుందరి కోసం అవతరించిన గ్రంథం అని అన్నారు. రంజాన్ ఉపవాసాలు మనిషిని మంచి, మానవతా విలువలు కలిగిన మంచివారిగా మలిచే శిక్షణ ఇస్తాయన్నారు. ఖురాన్ బోధనలను ప్రతిఒక్కరూ అనుసరించడం వలన సమాజంలో మానవుల మధ్య సఖ్యత ప్రేమానురాగాలు, సమాజంలో శాంతి సామరస్యం వెల్లువిరుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో షమీం, సోను, రబ్బాని, మసీదు, ఇమామ్, మహిళా సభ్యులు పర్వీన్, రాజేశ్వరి, లలిత, నర్సుదేవి, అరుణ, పద్మ పాల్గొన్నారు.